క్లుప్తంగా

బీమా సాయం అందజేత



బీమా సాయం చేస్తున్న బ్యాంక్ అధికారులు

రాజానగరం: ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఎస్‌బీఐ కస్టమర్ కుటుంబానికి శుక్రవారం బీమా సాయాన్ని అందజేశారు. లాలాచెరువు ఎస్‌బీఐ బ్రాంచ్ ఖాతాదారు అయిన కుంచె పల్లవి అక్టోబరు 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆమె నామినీ అయిన తండ్రి ఏసురత్నానికి బ్యాంకు రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాస్ చేతుల మీదుగా రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. అలాగే పీఎంఎస్‌బీవై పథకం కింద మంజూరైన మరో రూ.రెండు లక్షల చెక్కును కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ కె.కోటేశ్వరరావు, సేల్స్ మేనేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మాలధారణ



బలభద్రపురంలో సాయిబాబా మాలధారణ చేసిన భక్తులు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డీసాయి ఆలయం వద్ద 30 మంది భక్తులు శుక్రవారం సాయి మాలధారణ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 17 తేదీన సాయిబాబా ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు సాయిబాబా మాల ధారణ చేస్తున్నారన్నారు. వీరందరికీ ఆలయం వద్ద ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వార్షికోత్సవం రోజు సుమారు 20 వేల మందికి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం

పెదపూడి: సంపరలో కొలువైన విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి కంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రథం నిర్మాణానికి శంకుస్థాపన



రథం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నల్లమిల్లి సుబ్బారెడ్డి

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రథం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అర్జునుడికి కృష్ణుడు గీతోపదేశం చేస్తున్న ఆకారంలో దాదాపు రూ.18 లక్షలతో దాతలు, గ్రామస్తుల సహకారంతో ఈ నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నల్లమిల్లి సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోని ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నల్లమిల్లి రామచంద్రారెడ్డి (రాము) పాల్గొన్నారు.

వేధింపులపై వివాహిత ఫిర్యాదు

సీతానగరం: భర్త, కుటుంబ సభ్యులు తనను వేధిస్తున్నారంటూ నల్గొండకు చెందిన బందిల చంద్రలీల శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రలీలకు ఆరేళ్ల క్రితం పోశిబాబుతో వివాహమైంది. ఆ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. అయితే ఏడాది నుంచి నాగలక్ష్మి అనే మహిళతో కలిసి పోశిబాబు కోరుకొండలో నివాసం ఉంటున్నాడు. అలాగే అత్త సూర్యకాంతం, తోటికోడళ్లు శిరీష, పూజిత, మరుదులు వెంకటరత్నం, నాగేంద్ర తదితరులు పోశిబాబును సమర్థిస్తూ, చంద్రలీలను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అతి వేగంతో అనేక అనర్థాలు



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యకిషోర్

మధురపూడి: అతి వేగంతో అనేక అనర్థాలు జరుగుతాయని కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్ అన్నారు. కోరుకొండ మండలం మధురపూడి జంక్షన్‌లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పది మంది వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మధురపూడి జంక్షన్ వద్ద ఆరు నెలల్లో రెండు ప్రమాదాలు జరిగాయని, వాటిలో ముగ్గురు మృతి చెందిన సంగతిని గుర్తు చేశారు.

సామూహికం.. సత్ఫలితం

- వరి పంటకు ఎలుకల బెడద
- దిగుబడికి తీవ్ర నష్టం
- సామూహిక చర్యలతో నివారణ
- రైతులకు వ్యవసాయాధికారుల అవగాహన



ఎలుకల నిర్మూలనకు ఎరను తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంటను సాగు చేస్తున్న రైతులు మంచి దిగుబడి సాధించే దిశగా కసరత్తు చేస్తున్నారు. విత్తనాల నుంచి కోతకు వచ్చే వరకూ దిగుబడులను పెంచే విధంగా, నేలకు అవసరమైన బలాన్ని అందించేలా ఖర్చుకు వెనుకాడకుండా ఎరువులను, పురుగు మందులను వాడుతున్నారు. అయితే చీడపీడల నుంచి ఈ విధంగా పంటలను కాపాడుకుంటూ వచ్చినా గానీ, ఎలుకల బెడద మాత్రం వీడటం లేదు. దీంతో రైతులందరూ ఆందోళన చెందుతున్నారు.

ఎలుకలతో భారీ నష్టం

మంచి దిగుబడులు వస్తాయనుకునే సమయంలో ఎలుకల కారణంగా విపరీతంగా నష్టం కలుగుతోంది. ఒక్కోసారి ఆశించిన ఫలితాలను అన్నదాతలు అందుకోలేకపోతున్నారు. ఫలితంగా పెట్టిన పెట్టుబడులు రాక, అన్నదాతలు ఆర్థికంగా నలిగిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాధికారులు ముందుగానే రైతులను చైతన్యపరుస్తూ, ఎలుకల నిర్మూలనపై అప్రమత్తం చేస్తున్నారు. విడివిడిగా కాకుండా అంతా కలిసి సామూహికంగా ఎలుకలను నివారించే చర్యలు చేపట్టాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు అందుకుంటారని చెబుతున్నారు.

19,585 హెక్టార్లలో వరిసాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో ప్రస్తుతం 19,585 హెక్టార్లలో వరి పంట సాగు చేపట్టారు. ఈ సీజన్‌లో ముందుగా సాగు చేసిన ప్రాంతాలలో వరి పొలాలు చిరుపొట్ట, వెన్నుతొడిగే దశలలో ఉన్నాయి. ఈ సమయంలో పంటను నిరంతరం పరిశీలిస్తూ, ఎలుకల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంటను నాశనం చేసి, దిగుబడులను దెబ్బతీయడంలో ఎలుకలు ముందుంటాయి.

తీసుకోవాల్సిన చర్యలు

సాధారణంగా ఎలుకలు పొలాలలో గట్ల వెంబడి బొరియలు చేసుకుని, వాటిలో జీవనం సాగిస్తుంటాయి. కనుక ఆ బొరియలను గుర్తించి, వాటిలో పొగ పెడితే ఊపిరాడక అవి చనిపోవడం లేదా ఆ ప్రాంతాన్ని వదిలి దూరంగా పారిపోవడం చేస్తాయి. కొందరు రైతులు ఇలాంటి బొరియల వద్ద ఎలుకలను పట్టుకునేందుకు బోన్లు పెట్టిస్తుంటారు. మరి కొందరు పొలంలో బుట్టలు పెట్టి ఎలుకలను పట్టించే ప్రయత్నం చేస్తారు.. వీటన్నికంటే ఎలుకలను నిర్మూలించేందుకు క్రిమిసంహారక మందుతో తయారు చేసిన ఎరలు మంచి ఫలితాలను ఇస్తాయి.

ఎర వాడే విధానం

బ్రొమోడలైన్ 50 మిల్లీ గ్రాముల మందును రెండు కిలోల బియ్యంలో కలిపి ఎరను తయారు చేసి, గుర్తించిన బొరియల వద్ద ఉంచాలి. అయితే ఈ పని చేయడానికి రెండు రోజుల ముందు ఎలుకలకు నమ్మకాన్ని కలిగించే విధంగా రసాయన మందు కలపకుండా నూనె, బియ్యం కలిపి ఆ బొరియల వద్ద ఉంచాలి. వాటిని తిన్న ఎలుకలకు ఒక నమ్మకం కలుగుతుంది. ఆ తరువాత రసాయన మందు కలిపిన ఎరను పెడితే అదే నమ్మకంతో తిని, మరణిస్తాయి. ఇది కాకుండా పాస్పేట్, జింక్ సల్ఫేట్‌తో తయారు చేసిన బిస్కెట్లతో కూడా ఎలుకలు చనిపోతాయి. ఈ బిస్కెట్లను బొరియలలో వేస్తే, వాటి ద్వారా వ్యాపించే గాలిని పీల్చుకుని ఎలుకలు చనిపోతాయి. అయితే ఈ సమయంలో బిస్కెట్లకు చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. లేకుంటే కొత్త సమస్యలు ఎదురవుతాయి.

సామూహిక నివారణ చర్యలు

> పొలాలలో ఎలుకల నివారణను రైతులందరూ సామూహికంగా చేపటితే మంచి ఫలితాలు ఉంటాయి. ఎవరికి వారే వేర్వేరుగా చేపట్టడం వల్ల ఎలుకలు పక్క రైతు పొలంలోకి పారిపోయే అవకాశం ఉంటుంది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటుగా ప్రయాణించి తమ ప్రాణాలను కాపాడుకుంటాయి. ఆ ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి సామూహికంగా ఎలుకల నిర్మూలనా చర్యలు చేపడితే మంచి ఫలితాలను అందుకుంటారు. ఈ మేరకు గ్రామాలకు వెళ్లి రైతులను చైతన్యపరుస్తున్నాం.
>
> – షేక్ ఇమామి ఖాసిమ్, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

కచ్చితత్వంతో భూమి హద్దులు గుర్తించాలి



మిర్తిపాడులో విలేజ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

సీతానగరం: భూ రీసర్వేలో కచ్చితత్వంతో భూముల హద్దులను గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు సూచించారు. మిర్తిపాడులో జరుగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విలేజ్ మ్యాప్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రైతుల రికార్డులను పరిశీలించి, వాటి ఆధారంగా సర్వే చేసి, రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. మునికూడలిలో సివిల్ సప్లయ్ ఎండీయూ వాహనాన్ని తనిఖీచేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఆర్ఐ సునీత, రీసర్వే ఆర్ఐ మూర్తి, వీఆర్వో విజయశ్రీ ఉన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

సీతానగరం: మండలంలోని రాపాకకు చెందిన మేడిపూడి రాంబాబు (67) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన కాంగ్రెస్‌లో ఉంటూ రాపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రెసిడెంట్‌గా, మేజర్ పంచాయతీ రఘుదేవపురం ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాంబాబు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- అనుబంధ విభాగాల అధ్యక్షులకు సత్కారం



అనపర్తిలో వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ తరఫున వివిధ విభాగాలకు జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వారికి శుక్రవారం అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. పంచాయతీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలాటి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లభశెట్టి రామ సతీష్, వీవర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరావు, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజును మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో అందరికీ పార్టీ పదవులు ఇస్తున్నారన్నారు. కలిసికట్టుగా పార్టీ పటిష్టత కోసం మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కొల్లాటి ఇజ్రాయేలు, రంగంపేట మండల ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, మర్రిపూడి సర్పంచ్ వేము చిరంజీవి, పార్టీ నాయకులు గొల్లపల్లి రవికుమార్, బత్తిన రాంబాబు, కంటిపూడి నాగేశ్వరరావు, అడబాల కొండయ్య, కె.సత్యనారాయణ, కర్రి బాబులు, కొండేటి భీమేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి సత్కారం



అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న దుర్గారెడ్డి తదితరులు

పెదపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన పడాల దుర్గారెడ్డి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనపర్తిలో గంగిరెడ్డి నర్సింగ్ హోమ్ వద్ద మాజీ ఎమ్మెల్యేను దుర్గారెడ్డి, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పూల మాలలు వేసి సన్మానించారు. సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. దానికి గాను యువజన విభాగాన్ని మరింత విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు గొడితి బాలకృష్ణ, జుత్తక రాజేష్, పులగం చంద్రశేఖర్ రెడ్డి, తేతలి రవి సుమంత్‌రెడ్డి (సైరా) తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవుని కల్యాణానికి కొబ్బరి బొండాలు సిద్ధం



కల్యాణోత్సవానికి సిద్ధం చేసిన కొబ్బరి బొండాలు



ఆలయ ప్రధాన అర్చకుడికి కొబ్బరి బొండాలు అందజేస్తున్న యువరాజారెడ్డి, కుటుంబ సభ్యులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో శనివారం జరిగే సూర్యనారాయణమూర్తి కల్యాణంలో వినియోగించడానికి కల్యాణ కొబ్బరి బొండాలు సిద్ధమయ్యాయి. అదే గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు డి.యువరాజారెడ్డి, సంధ్యా డెకరేషన్ సిబ్బంది వీటిని తయారు చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శంఖు, చక్ర, నామాలను అందంగా రంగులు, ముత్యాల పొడులు, లేసులు, అలంకరణ పూసలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. 16 ఏళ్లగా ఏటా వీటిని భక్తితో సమర్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది రెండోసారి పుట్టకొండ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి కొబ్బరి బొండాలు అందజేశామన్నారు.

కూటమి పాలనలో పేదల సంక్షేమం శూన్యం



సీతారామపురంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన జక్కంపూడి రాజా

- ఎన్నికల హామీలు ఏమయ్యాయి!
- మోసపోయిన ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా 'నా కార్యకర్తలు – నా కుటుంబం'

రాజానగరం: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రజలపై ఎన్నో వరాలు, హామీలు కురిపించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కూటమి పాలనలో పేదలకు జరుగుతున్న మేలు శూన్యమన్నారు. కూటమి నాయకుల హామీలను నమ్మి మోసపోయిన పేదలకు అండగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. దీనిలో భాగంగా రూపొందించిన 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమాన్ని రాజానగరం మండలం సీతారామపురం నుంచి శుక్రవారం ఆయన ప్రారంభించారు. పార్టీ శ్రేణులతో సమావేశమై, వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అండగా నిలబడి అన్యాయాన్ని ఎదురించడంలో సైనికుల్లా పనిచేయాలన్నారు.

సంపదను దోపిడీ చేస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పారని, కానీ ఇప్పుడు రాష్ట్రంలోని సంపదనంతా దోపిడీ చేసేస్తున్నారని ఆరోపించారు. గోదావరిలో ఇసుక, చెరువు, కొండలలో మట్టిని తోడేస్తూ, తోడేళ్ల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని, సూపర్ సిక్స్ పేరుతో మద్యం బ్రాండ్ తీసుకువచ్చారన్నారు. బాబూ ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ అనే మాటను పక్కన పెట్టారన్నారు. ప్రజలపై రకరకాల పన్నుల భారం వేసి, బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీగా చేశారన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అండగా నిలవడటమే జక్కంపూడి కుటుంబం నైజమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, అడబాల చినబాబు, అడపా కనకరాజు, మండారపు వీర్రాజు, గండి నానిబాబు, కోలపాటి వెంకన్న, కొండపల్లి దుర్గారావు, కంటే వినయ్‌తేజ, బాబ్జీ, బద్రి, జగదీష్, తేజోనాయుడు, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

పదవుల్లో ప్రాధాన్యమివ్వడంపై హర్షం

రంగంపేట: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల పదవుల్లో రంగంపేట మండలానికి ప్రాధాన్యం ఇవ్వడంపై మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చొరవతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన పదవుల్లో రంగంపేట గ్రామానికి చెందిన పాలాటి నాగేశ్వరరావును పంచాయితీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా, కుసుమంచి కృష్ణంరాజును కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా, వెంకటాపురం గ్రామానికి చెందిన ముంగి గంగరాజును అనపర్తి నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా నియమించారు.

వీరి ఎంపిక పట్ల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయేలు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు అడబాల వెంకటేశ్వరరావు, మాచిన గోవిందరాజు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు, వైస్ ఎంపీపీలు రాయుడు రాంబాబు, మట్టా శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు ఆకుకూరల పంపిణీ



తొస్సిపూడిలో ఆకుకూరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం

బిక్కవోలు: రసాయన ఎరువులు, పురుగు మందుల అవశేషాలు లేని పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందించాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ శాంతి రత్న కుమారి తెలిపారు. తొస్సిపూడి గ్రామంలోని సచివాలయం వద్ద పండించిన ఆకు కూరలను శుక్రవారం మండలంలోని ఆ గ్రామంలోని 100, 101 కోడ్ నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ పోషణ వాటికల ఏర్పాటుకు అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలు చొప్పున నిధులు విడుదల చేశారన్నారు. వీటితో విత్తనాలు కొనుగోలు చేసి, వాటికల తయారీ, నీటి సదుపాయం వంటి వాటిని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమకూర్చుకోవాలన్నారు. పండించిన పంటలను ఉచితంగా బాలింతలు , గర్భిణులకు పంపిణీ చేయడంతో పాటు అంగన్ వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండి పెట్టాలన్నారు. పూర్తి సేంద్రియ పద్ధతిలో పంటలను పండించాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం, నందిని చారిటబుల్ సంస్థ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి, బీసీ నాయకుడు కర్రి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కామేశ్వరి, అమ్మాజీ తదితరులు ఆకు కూరలను పంపిణీ చేశారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

సీతానగరం: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వంగలపూడి ఇసుక ర్యాంపు నిర్వాహక సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు హెచ్చరించారు. రాజమహేంద్రవరం ఇన్‌చార్జీ ఆర్డీవో భాస్కర రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం వంగలపూడి రీచ్–2లో విచారణ చేశారు. ఇక్కడ ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారని నాలుగు రోజుల క్రితం కాకినాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేసీ ఇక్కడ విచారణ చేశారు. ర్యాంపు నిర్వాహక సిబ్బందికి ఐడీ కార్డులు లేకపోవడంపై ప్రశ్నించారు. రికార్డులను, బిల్లులను ఆర్డీవో పరిశీలించారు. ర్యాంపులో సిబ్బంది పని తీరు బాగా లేదని, ప్రభుత్వ పనులకు ఐదు లారీలు ఇసుక కావాలని కోరితే.. సాయంత్రం వరకు ఉంచుకుని ఖాళీ లారీలను వెనక్కి పంపారని హౌసింగ్ డీఈ సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ మూర్తి, మైన్స్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న ట్రాలీ

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు
- శుభ కార్యక్రమానికి వెళుతుండగా ఘటన

రాజానగరం: కుమార్తె ఇంట జరిగే ఒక శుభ కార్యక్రమానికి భర్తతో కలసి స్కూటీపై వెళుతున్న మహిళను మృత్యువు ట్రాలీ రూపంలో కబలించింది. ఈ సంఘటనలో భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై గైట్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. బొమ్మూరుకు చెందిన వాకలపూడి రాజేశ్వరి (65) భర్త వెంకటేశ్వరరావుతో కలిసి స్కూటీపై రాజానగరం మండలం పల్లకడియంలో ఉంటున్న కుమార్తె ఇంటికి పయనమైంది. గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఢీ కొనడంతో తలకు బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న ఆమె భర్త వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలవ్వడంతో 108లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది.. రాజేశ్వరిని పరీక్షించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. వీరి అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, అమ్మాయి పల్లకడియంలో ఉంటోంది. రాజానగరం ఎస్సై మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణే విజయానికి మూలం



పాలకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబును సన్మానిస్తున్న అధ్యాపకులు

సీతానగరం: క్రమశిక్షణే విజయానికి మూలమని పార్వతీపురం జిల్లా పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్ బాబు అన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్యామ్ బాబు మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు అన్ని విషయాలను నేర్చుకుంటున్నా, క్రమశిక్షణ లేకపోవడంతో సోషల్ మీడియాకి బానిసలై ఓడిపోతున్నారన్నారు. సెల్‌ఫోన్‌ను సక్రమంగా వాడితే మీ సమయం వృథా కాదన్నారు. విద్యార్థులకు కెమిస్ట్రీ, ఇతర రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, అధ్యాపకులు సన్మానించారు.